క్లుప్తంగా

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని గిరిజన గురుకుల డిగ్రీ బాలికల కళాశాల(దమ్మపేట)లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన కోరారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన గిరిజన, గిరిజనేతర విద్యార్థినులు కళాశాలలో అందుబాటులో ఉన్న బీఏ, బీకాం(జీ), బీకాం(సీఏ), బీజెడ్సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్ గ్రూపులలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ సాగుతోందని, అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. కళాశాలలో విద్యార్థులకు ఎన్సీసీ, స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్ అవకాశాలతోపాటు వృత్తి విద్యా కోర్సులు, ఉన్నత విద్య కోసం ఉచిత శిక్షణ ఇస్తామని వివరించారు. ప్రవేశాల కోసం సెల్ నంబర్లు 87905 86772, 93813 31472 సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

పనివేళల్లో మార్పు సరికాదు



మాట్లాడుతున్న రాంగోపాల్

మణుగూరుటౌన్: అభినందన సభ పేరుతో కార్మికుల పనివేళల మార్పు నిర్ణయంపై ప్రయోగాత్మక ప్రకటన సరికాదని ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్మికుల పనివేళల మార్పుపై గత నెల 7, 8వ తేదీల్లో చైర్మన్, గుర్తింపు సంఘం నేతలతో జరిగిన సమావేశంలో చర్చకు రాగా.. ఆనాడే వ్యతిరేకించామన్నారు. ఇప్పుడు అదే అంశాన్ని కార్మికుల ముందుంచడాన్ని గుర్తింపు సంఘంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్మికులు భయాందోళనకు గురికావాల్సిన పనిలేదని, పనివేళల మార్పుకు గుర్తింపు సంఘం అంగీకరించబోదని భరోసానిచ్చారు.

కఠినచర్యలు తీసుకోవాలి

ములకలపల్లి: ములకలపల్లి–తాళ్లపాయ హైలెవల్ బ్రిడ్జి శంకుస్థాపన శిలాఫలకం ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి, ములకలపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు పుష్పాల హనుమంతు డిమాండ్ చేశారు. 'కానరాని శిలాఫకాలు..'శీర్షికన.. ముక్కలుగా విరిగిపోయిన శిలాఫలకం తీరుపై సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విధితమే. ఈ క్రమంలో విలేకరులు సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏటీడీఏ ఏఈ సుబ్బరాజును సంప్రదించగా, గుర్తుతెలియన వాహనం ఢీకొని, శిలాఫలకం ధ్వంసమైందని, యుద్ధప్రాతిపదికన మరొకటి ఏర్పాటు చేస్తామని తెలిపినట్లు వారు పేర్కొన్నారు. బండి కొమరయ్య, పుష్పాల చందర్‌రావు, సున్నం బాబూరావు, పుష్పాల సాయి, అయితంరాజు నాగేశ్వరరావు, బొర్రా శ్రీను, సోందు తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మణుగూరు ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది ఆరోగ్యం, మాతాశిశు సంరక్షణ, జీవనశైలిలో మార్పు వంటి అంశాలపై పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్, పొగాకు, మద్యం వంటి తీసుకోవద్దని, తగినంత వ్యాయామం చేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ పరంగిణి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, ప్రభావతి, ఝాన్సీ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: తోటి ఆటో డ్రైవర్ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో శ్రీ సీతారామ ఆటో యూనియన్ సభ్యులు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం సోమవారం అందజేశారు. మండల పరిధిలోని చిన్న బండిరేవు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తంతరపల్లి శేఖర్ కొద్ది రోజుల క్రితం మృతిచెందగా.. అతని కుటుంబానికి ఆటోకార్మికులు రూ.10వేలను వితరణగా అందించారు. కార్యక్రమంలో శ్రీ సీతారామ ఆటో యూనియన్ అధ్యక్షుడు పానుగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం, పాడుతూరి సతీష్, పసుపులేటి రవి తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సీతారామా..

పరిహారంలో జాప్యమేలా!?

- ఐదేళ్లుగా రైతుల ఎదురుచూపులు
- అందని రైతుబంధు, రుణ సాయం
- పరిహారమివ్వండి.. లేదా భూములు తిరిగిచ్చేయాలని నిర్వాసితుల వినతి



జగ్గారంలోని ఆయిల్‌పామ్ క్షేత్రంలో సమావేశమైన నిర్వాసిత గిరిజన రైతులు (ఫైల్)

దమ్మపేట: సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణ పనుల నిమిత్తం భూములు కోల్పోయిన అనేక మంది గిరిజన రైతులకు.. ఐదు సంవత్సరాలు గడిచినప్పటికీ పరిహారం అందలేదు. దీంతో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేపథ్యం ఇది..

సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణ పనుల నిమిత్తం మండలంలోని జగ్గారం రెవెన్యూ.. లింగాలపల్లి, గొర్రెగుట్ట, మల్లారం తదితర గిరిజన గ్రామాల్లో భూ సేకరణ చట్టం నిబంధనలను అనుసరించి, గెజిట్ నోటిఫికేషన్ ద్వారా 2019లో భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారు. నోటిఫికేషన్ అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా ఏర్పాటు చేసిన భూ సేకరణ కమిటీల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి, రైతులతో సంప్రదింపులు జరిపారు. భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అందించే పరిహారం తదితర వివరాలను తెలియజేసి, భూయజమానులను ఒప్పించారు. భూ యజమానుల అంగీకారంతోనే సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన భూములను సేకరించి, అవార్డు (ఒప్పందం) ప్రక్రియను పూర్తి చేశారు. ఆ కొద్ది రోజుల వ్యవధిలోనే పరిహారం మొత్తాన్ని ఏకకాలంలో రైతులకు అందజేస్తామని, సంబంధిత రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. ఇది గడిచి ఐదు సంవత్సరాలు పూర్తయినప్పటికీ రైతులకు పరిహారం అందలేదు.

సమస్య ఏంటి..?

జగ్గారం రెవెన్యూ పరిధిలో 2019, సెప్టెంబర్‌లో భూసేకరణ కమిటీ ద్వారా ఏర్పాటు చేసిన సమావేశంలో 128 మంది రైతులను కాలవ కింద మొత్తంగా 107 ఎకరాల 3 కుంటల భూమిని ఇచ్చేలా ఒప్పించారు. పరిహారంగా అసైన్‌మెంట్, పట్టా భూములకు ఒక ఎకరానికి రూ. 8 లక్షల రూపాయలు అందజేయనున్నామని తెలిపారు. పది రోజుల్లోనే జగ్గారం గ్రామ రెవెన్యూ పరిధిలోని రైతులకు పరిహార ప్రక్రియ పూర్తవుతుందని, అందు నిమిత్తంగా పరిహారం మొత్తాన్ని ఏకకాలంలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కాని ఇప్పటికి సంవత్సరాలు గడుస్తున్నా రెవెన్యూ అధికారుల నుంచి స్పందన లేదు. దీంతో భూ యజమానులు పలుమార్లు అధికారులను కలిసి విన్నవించుకున్నారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

నష్టపోయిన భూ యజమానులు..

సీతారామ కాలువ భూముల నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో జాప్యం కారణంగా ఆర్థికంగా చాలా నష్టపోయామని మండల పరిధిలోని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం వెంటనే అందుతుందనే ఉద్దేశంతో భూమిలో సాగులోనున్న మామిడి, జీడి మామిడి, జామాయిల్ మొక్కలను రైతులు నరికించేశారు. 2019 సెప్టెంబర్‌లో అవార్డు ప్రక్రియ పూర్తయిన తర్వాత రెవెన్యూ రికార్డుల్లో భూ పట్టాదారు కాలంలో రైతుల పేర్లు తొలగించి, నీటి పారుదల శాఖ పేరును నమోదు చేశారు. దీంతో ఐదు సంవత్సరాలుగా పరిహారం అందకపోగా.. ప్రభుత్వం నుంచి అందాల్సిన వ్యవసాయ రుణాలు, రైతుబంధును పొందే అవకాశం కోల్పోయామని రైతులు అంటున్నారు. దీంతోపాటు రైతులు కాలువ కింద ఇచ్చిన భూముల్లో ఉన్న ఫల సాయం ఇచ్చే మొక్కలు, చెట్లు, వ్యవసాయ బోర్లకు ప్రత్యేకంగా పరిహారం లేదని అధికారులు చెప్పడం శోచనీయమని నిర్వాసిత గిరిజన రైతులు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఇటీవల మూకుమ్మడిగా జగ్గారం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో సమావేశమయ్యారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం అదనపు పరిహారం పొందేలా, ప్రజాస్వామ్య రీతిలో పోరాటం చేయడానికి విధివిధానాలను వారు రూపొందించుకున్నారు.

ప్రస్తుత ధర చెల్లించాలి



జగ్గారం రెవెన్యూ పరిధిలోని కాలువ కింద కోల్పోయిన మా భూములకు ఒక ఎకరానికి రూ.8 లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తామని ఐదు సంవత్సరాల క్రితం హామీ ఇచ్చారు. నేటికీ పరిహారం చెల్లించలేదు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర ప్రకారం మాకు పరిహారం అందజేయాలని కోరుతున్నాం.

– మడకం బొదప్ప, గిరిజన రైతు

మా భూములు మాకివ్వండి



గొర్రెగుట్ట గ్రామ పరిధిలో మా కుటుంబ సభ్యుల పేరు మీద మూడున్నర ఎకరాల వ్యవసాయ భూమిని సీతారామ కాలువ నిర్మాణం కోసం ఇచ్చాం. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం కోల్పోయిన భూమికి పరిహారంతో పాటుగా ఫల సాయం ఇచ్చే మొక్కలకు పరిహారం ఇవ్వాలి. లేదంటే మా భూములు మాకివ్వండి.

– వాడే వీరాస్వామి, ఆదివాసీ జిల్లా నాయకుడు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



నేను ఇటీవలే దమ్మపేట ఇన్‌చార్జ్ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించాను. ఈ పరిహారం చెల్లింపు ప్రక్రియలో జాప్యంపై నాకు పూర్తిస్థాయిలో అవగాహన లేదు. సంబంధిత సమస్యపై ఉన్నతాధికారులకు తెలియజేసి, నిర్వాసితులకు పరిహారం అందేలా కృషి చేస్తాను.

– కె.వాణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



కాచనపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

గుండాల: గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించారు. ఆళ్లపల్లి మండలంలోని రాయిపాడులో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. అనంతోగు, కాచనపల్లిలో తెల్లరేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. రెండు మండలాల్లోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఆళ్లపల్లి మండలంలోని కిన్నెరసానిపై రూ.9.51 కోట్లతో నిర్మించే చెక్‌డ్యాం పనులు పరిశీలించారు. నాణ్యత పాటించి వర్షాకాలం లోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఇంకా మంచినీటి కొరత ఉందని, తక్షణమే నీళ్లు అందించాలని మిషన్ భగీరథ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మండలంలో పర్యటిస్తున్న విషయం తెలిసినా పూర్తి స్థాయిలో అధికారులు రాలేదంటే పనితీరు ఎలా ఉందో అర్థమవుతుందని అన్నారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపల్లి, గుండాల తహసీల్దార్‌లు శకుంతల, ఇమ్మానుయేల్, ఎంపీడీఓలు సత్యనారాయణ, శ్రీనివాస్, ఎట వెంకటరమణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

బూర్గంపాడు: రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పినపాక పట్టినగర్ గ్రామంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ అభ్యున్నతికి 45ఏళ్లుగా భారతీయ జనతాపార్టీ అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచంలో తిరుగులేని శక్తిగా తయారైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయాయని విమర్శించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, షేక్ బాబులాల్, రెంటాల నాగేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గుగులోత్ బాలునాయక్, చుక్కపల్లి బాలాజీ, భూక్యా వెంకట్, కేసగాని శ్రీనివాస్‌గౌడ్, గడ్డం సతీష్, బానోత్ వెంకటేశ్, దుప్పటి సురేష్, బుద్ధ ధర్మరాజు, కొడెబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీకి వినతుల వెల్లువ



మణుగూరుటౌన్: సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్మిక నేతల ఆధ్వర్యంలో..

మణుగూరుటౌన్: సింగరేణి మణుగూరు ఏరియా భవిష్యత్ దృష్ట్యా పీకేఓసీ, మణుగూరు ఓసీ విస్తరణ పనులు వేగవంతం చేయాలని సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌తోపాటు ఇతర అధికారులను కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మణుగూరు ఏరియాలో సోమవారం పర్యటించి సంస్థ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈపీ ఆపరేటర్లకు సూటబుల్ జాబ్ కల్పించేలా మూడున్నరేళ్ల క్రితం జరిగిన ఒప్పందాన్ని అమలుచేయాలని, ఏరియా ఆస్పత్రిలో వైద్యనిపుణులు, సిబ్బందిని నియమించి అవసరమైన యంత్రాలు సమకూర్చాలని కోరారు. అలాగే, ఓసీల్లో నాణ్యమైన యంత్రాలు కొనుగోలు చేయాలని, కూల్చిన కూనవరం క్వార్టర్ల స్థానంలో 400 క్వార్టర్లు నిర్మించాలని అన్నారు. క్యాంటీన్‌లో నాణ్యత మెరుగుపర్చడం, ఉద్యోగులకు 250 గజాల స్థలం కేటాయింపు, కాంట్రాక్ట్ కార్మికులకు క్యాంటీన్ సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ, కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించడంతో పాటు ఖాళీ క్వార్టర్లను కేటాయింపు తదితర అంశాలను వినతిలో ప్రస్తావించారు. వినతిపత్రం అందించిన వారిలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ నాయకులు ఉన్నారు.

ఈపీ ఆపరేటర్ల ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: సింగరేణి వ్యాప్తంగా ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సూటబుల్ జాబ్, ఇతర సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ పీకేఓసీ పర్యటనకు వచ్చిన సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌కు ఈపీ ఆపరేటర్లు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. డిప్రమోటై జనరల్ మజ్దూర్‌లుగా పని చేస్తున్న ఆపరేటర్లకు న్యాయం, గోదావరి టీటీసీ శిక్షణకు వెళ్లే ఆపరేటర్లకు ఓడీ, ఇన్సెంటీవ్స్ తదితర సమస్యలను వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్లు ఎం.మహి, కె.బాబులాల్, జి.ఇస్సాక్, మేకల కేశవస్వామి, ఆకుల కృష్ణారావు, గోశిక కుమారస్వామి, అంకం లక్ష్మీనారాయణ, జనార్దన్, ఊకే సమ్మయ్య, శాంతయ్య, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్షుల దప్పిక తీర్చేందుకు చర్యలు

అశ్వాపురం: ఎండల తీవ్రతకు మనుషులతో పాటు పశుపక్ష్యాదులు సైతం ఉక్కిరి బిక్కిరి అవుతున్న నేపథ్యంలో.. పక్షుల దాహం తీర్చేందుకు మండల పరిషత్ కార్యాలయం అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎంపీడీఓ వరప్రసాద్, యూడీసీ పద్మావతి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం పక్షుల సమూహం ఉండే పలు చోట్ల నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. అశ్వాపురం రేంజ్ పరిధిలో అటవీ శాఖ అధికారులు సైతం అడవుల్లో పలుచోట్ల ఇటువంటి తొట్టెలు ఏర్పాటు చేసి పక్షులు దాహం తీర్చేందుకు కృషి చేస్తున్నారు.

ఏరియర్స్ తక్షణమే ఇవ్వాలి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు 32 నెలల ఏరియర్స్ తక్షణమే ఇవ్వాలని కార్మికులు సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా సోమవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి సమ్మెను ప్రారంభించి మాట్లాడుతూ.. ఏరియర్స్ చెల్లింపుపై ఎన్నోసార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదని, అధికారుల తీరు మార్చుకుని సమస్యను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడిశాల రాములు, పల్లపు నాగేశ్వరరావు, నర్సింహారావు, దుర్గయ్య, రమాదేవి, పుల్లయ్య, ఎల్లమ్మ, లక్ష్మీనారాయణ, వేణు, హరీష్, చంద్రయ్య, సాయమ్మ, నరసమ్మ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కుంజా ధర్మా

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో బీజేపీ 45వ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మ పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. దేశం, ధర్మం కోసం పాటుపడుతూ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతున్న పార్టీ బీజేపీ అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం ఉన్నదీ బీజేపీకే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్‌రావు, నాగబాబు, సతీష్, కోటేశ్వరి, వెంకన్న, ఉపేంద్ర, శ్రీహరి, ఆవుల సుబ్బారావు, సమీరా తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనుల పరిశీలన



దమ్మపేట: మండలపల్లిలో డివైడర్ నిర్మాణంపై సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: మండల పరిధిలోని మండలపల్లి నుంచి దమ్మపేట ప్రధాన సెంటరు వరకు జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించారు. పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని అక్కడి బాధ్యులకు సూచించారు. అంతకుముందు నాచారంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మారబోయిన హరిబాబును పరామర్శించి, అనారోగ్యంతో మృతి చెందిన భూషణం భౌతికకాయానికి నివాళులర్పించారు. పరామర్శ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు చీకటి శ్రీనివాసరావు, గూడపాటి వెంకట్రావు, ఎర్రగొర్ల రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ వేపకుంట్ల వెంకమ్మ తదితరులున్నారు.

పాఠశాల వార్షికోత్సవానికి హాజరు..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారంవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాల(పీఎంశ్రీ) వార్షికోత్సవ వేడుకలకు సోమవారం నిర్వహించగా.. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. పాఠశాలకు వంద శాతం హాజరైన విద్యార్థుల, వారి తల్లిదండ్రులను ఆయన సన్మానించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆట, పాటల పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంఈవో ప్రసాద్‌రావు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు షాహినా బేగం, వీరేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్

చర్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా. సహకార సంఘ అధ్యక్షుడు పరుచూరి రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా రైతులకు లబ్ధి చేకూరాలన్న ఉద్దేశ్యంతో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. రబీలో ఏ గ్రేడ్‌రకం ధాన్యానికి రూ.2,320లు, సాధారణ రకం ధాన్యానికి రూ.2,300గా ప్రభుత్వ ధర నిర్ణయించిందని తెలిపారు. వీటితో పాటు సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్‌గా కూడా ప్రభుత్వం ఇస్తోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘ సీఈఓ ఎస్‌డి.జిలానీ, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.లావణ్య, ఏఈఓలు ఎండి.అఫ్రీద్, ఏ.రామకృష్ణ, రైతులు మేడిచర్ల సూర్యనారాయణ, ముత్యాల విశ్వేశ్వరరావు, ముత్యాల సంపత్, శీలం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సొసైటీని చీల్చేందుకు యత్నం'



సమావేశంలో మాట్లాడుతున్న సమ్మక్క–సారలమ్మ ఇసుక సొసైటీ ప్రతినిధులు

మణుగూరుటౌన్: ఇసుక సొసైటీల మీద ఆధారపడి జీవిస్తున్న తమను, తమ ఊరిని రెండు గ్రూపులుగా చీల్చి ఇసుక రీచ్ పొందాలని ఓ కాంట్రాక్టర్ ప్రయత్నిస్తున్నట్లు, ఆ మేరకు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చినరావిగూడెం సమ్మక్క సారలమ్మ ట్రైబల్ ఇసుక సొసైటీ సభ్యులు ఆరోపించారు. సోమవారం ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఓ వ్యక్తి ఎమ్మెల్యే పేరు చెప్పి గ్రామంలో 148 మందితో ఉన్న సొసైటీని రెండుగా చీల్చి లబ్ధి పొందాలని చూస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ప్రశ్నించిన తమపై కారుతో ఢీకొట్టగా గాయాలయ్యాయని, ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తెల్లం వెంకటరమణ, కుంజా లక్ష్మి, సరోజిని, ఆదిలక్ష్మి, శ్యామల మహేశ్వరి, కమలమ్మ, పాయం నాగమ్మ, రమాదేవి, రజిని కుమారి, రత్నం, నాగమణి, నానమ్మ, కమల, రమణ తదితరులు ఉన్నారు.

బదిలీ హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎం శంకర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ములకలపల్లి: స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి, ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లిన హెచ్‌ఎం శంకర్ తోపాటు సుధాకర్, అనిత, ఈశ్వరి, పద్మ, విజయలను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో సోమవారం కార్యక్రమం ఏర్పాటు చేయగా.. సీపీఐ జిల్లా నాయకులు నరాటి ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఎం పూర్ణచందర్‌రావు అధ్యక్షత వహించగా.. టీఆర్‌టీయూ, టీజీపీటీఎఫ్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పూనెం పూర్ణయ్య, మాలూ, కిషోర్, సీతారాం, గోపి, ఉపాధ్యాయులు శ్రీను, సునిత, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

యర్రా శ్రీకాంత్ మరణం తీరని లోటు

బూర్గంపాడు: యర్రా శ్రీకాంత్ మరణం సీపీఎంకు తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో సోమవారం యర్రా శ్రీకాంత్ సంతాప సభ నిర్వహించారు. శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పార్టీ అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాపినేని సరోజని, ఎస్‌కె.అబీదా, మీనా, అరవింద్, ఉపేందర్, రామకృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఎస్‌టీఎస్‌ఈలో ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుపొందినట్లు హెచ్‌ఎమ్ మధు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి 112 మంది విద్యార్థులకు లాప్‌ట్యాప్, గోల్డ్‌మెడల్ తో పాటు మెరిట్ సర్టిఫికెట్లు లభించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలపై ఇంటింటి సర్వే



పట్టణంలో సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని 14వ వార్డు అశోక్‌నగర్ కాలనీలో సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ.. సర్వే బృందం వద్ద ప్రజలు తమ ఆవేదనను వెలిబుచుకున్నారని, ముఖ్యంగా రేషన్ కార్డులు లేక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. సర్వే కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు చాట్ల శ్రీనివాస్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి డి.సతీష్ బాబు, సునీల, రమణ, జానకమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అండర్ బ్రిడ్జి రహదారి



గొందిగూడెంలో అధ్వానంగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామపంచాయతీలో రెండు చోట్ల రైల్వే అండర్ బ్రిడ్జి రహదారులు గుంతలమయమై అధ్వానంగా మారాయి. గుంతలు గుంతలుగా ఉన్న అండర్ బ్రిడ్జి రహదారులపై ప్రయాణించాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో అండర్ బ్రిడ్జిలు మోకాళ్ల లోతు నీటితో రాకపోకలకు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా అండర్ బ్రిడ్జి రహదారులు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నప్పటికీ రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. రైల్వే శాఖ పరిధిలో ఉండటంతో గ్రామ పంచాయతీ వారు కూడా మరమ్మతులు చేయడం లేదు. రైల్వే అధికారులు స్పందించి రైల్వే అండర్ బ్రిడ్జి రహదారులు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.